విలువలకు, త్యాగానికి ప్రతీక బక్రీద్


చింతలపూడి: ఈద్గాలో బక్రీద్ పండుగ విశిష్టతను వివరిస్తున్న ఇమామ్


లింగపాలెం: ధర్మాజీగూడెంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


కొయ్యలగూడెం: జామియా మసీదులో దువా ఆచరిస్తున్న ముస్లింలు

చింతలపూడి: చింతలపూడి పట్టణంలో సోమవారం ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఈద్గాలో ముస్లింల చేత ఇమామ్ షేక్ అబ్దుల్ వదూద్ ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. అనంతరం బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. విలువలకు, త్యాగానికి బక్రీద్ పండుగ ప్రతీక అని ఇమామ్ అన్నారు. ప్రార్థనల అనంతరం ఖబర్‌స్థాన్‌కు చేరుకుని దివంగత కుటుంబ సభ్యుల ఆత్మశాంతికి ప్రార్థనలు చేశారు. చింతలపూడితో పాటు రాఘవాపురం, ప్రగడవరం, యర్రగుంటపల్లి, సీతానగరం గ్రామాల్లో కూడా బక్రీద్ పర్వదినాన్ని అత్యంత ఘనంగా జరుపుకున్నారు.

లింగపాలెం: లింగపాలెం మండలంలో బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ధర్మాజీగూడెం, కలరాయునగూడెం, కొణిజర్ల, లింగపాలెం, కొత్తపల్లి, తిమ్మక్కపాలెం, రంగాపురం తదితర గ్రామాల్లో ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధర్మాజీగూడెంలో ముస్లింలు ప్రదర్శనగా ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధర్మాజీగూడెం మసీద్ మతగురువు షేక్ తోఫీక్ (ఇమామ్), గౌరవ అధ్యక్షుడు ఎండీ అక్బర్ ఆలీ బక్రీద్ విశిష్టతను ముస్లింలకు ఉద్బోధించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకర్ని ఒకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అంజిమాన్ మెహఫిజిల్ ఇస్లాం కమిటీ అధ్యక్షుడు ఎండీ గౌస్‌మోహీద్దీన్, సయ్యద్ బాజీ, హుస్సేన్ లాల్‌అహ్మద్, షేక్ షరీఫ్, ఎస్‌కే సాధిక్, పీరావలి, జిలానీ, మస్తాన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తి ప్రపత్తులతో సోమవారం మండల వ్యాప్తంగా నిర్వహించుకున్నారు. కొయ్యలగూడెం జామియా మసీదులో ఇమామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక దువా ఆచరించారు. అనంతరం ప్రార్థనలు చేశారు. కన్నాపురం, యర్రంపేట, బయ్యన్నగూడెం, రాజవరం, వేదాంతపురం, దిప్పకాయలపాడు గ్రామాల్లోని మసీదుల వద్ద బక్రీదు విశిష్టతను మత పెద్దలు వివరించారు. అనంతరం పేదలకు దానధర్మాలు నిర్వహించారు.

బుట్టాయగూడెం: మండలంలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బుట్టాయగూడెం, దొరమామిడి, రామన్నగూడెం, రెడ్డిగణపవరం, పులిరామన్నగూడెం గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత గురువు ఇమామ్ ముస్లిం సోదరులకు బక్రీద్ సందేశాన్ని ఇచ్చారు.

పోలవరం రూరల్: బక్రీద్ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పోలవరంలోని అహలే సున్నత్ జమాత్ ముస్లింలు ఈద్గాలో ప్రార్థనలు జరిపారు. అనంతరం ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనాలతో పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ పండుగ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అన్ని మసీదులు ముస్లిం సోదరులతో కళకళలాడాయి. దొరసానిపాడు, ద్వారకాతిరుమల, తిరుమలంపాలెం, పంగిడిగూడెం, దేవినేనివారిగూడెం, ఐఎస్ రామానుజాపురం తదితర గ్రామాల్లోని ముస్లిం సోదరులు ఉదయాన్నే మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువులు బక్రీద్ ప్రాముఖ్యతను వివరించారు.


బుట్టాయగూడెం: ఈద్గా వద్ద సామూహిక ముస్లిం సోదరుల ప్రార్థనలు


పోలవరం: ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు


ద్వారకాతిరుమల: దేవినేనివారిగూడెంలో బక్రీద్ ప్రాముఖ్యతను వివరిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం


బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అంకాలగూడెం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన సొంగా రాజేష్ కుటుంబానికి దాతలు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. నల్లజర్ల మండలం చీపురుగూడెం గ్రామానికి చెందిన సామాజికవేత్త, వసంతాడ ఆనంద్ స్వరూప్, ఉండుర్తి రమణ మహర్షి మిత్ర బృందంలోని సభ్యులు బాధిత కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గుళ్లపూడి సతీష్ గుప్తా, రాచర్ల సంజన ప్రణీత్, గెల్లా రాజు, బొల్లిపో మధుశేఖర్, కవిటి లలిత, పూసల సురేష్, బొందల శ్రీనివాస్, పాక వీరన్న, ముండ్రు శ్వేత, కొరపాటి రామకృష్ణ, ధర్మవరపు గణేష్, సుధా, గుజ్జుళ్ళ సంతోషి మాత పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం

అంకాలగూడెంలో సొంగ శేఖర్ కుటుంబానికి మానవత కొయ్యలగూడెం శాఖ రూ.3,500 ఆర్థిక సహాయం సోమవారం అందజేసింది. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు బొమ్మ మోహన్, కోశాధికారి రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

పేద దంపతులకు చేయూత

దెందులూరు: అక్కిరెడ్డిగూడెంలో నివసిస్తున్న యువ్వనపూడి నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులకు సొంత గూడు లేక ఇబ్బంది పడుతున్నారు. కొబ్బరి మట్టలతో వారు ఏర్పాటు చేసిన గుడిసెలో విద్యుత్ వంటి కనీస సౌకర్యం కూడా లేదు. దశాబ్ద కాలంగా దెందులూరు నియోజకవర్గంలో పేదలకు, రోగులకు ఆపన్నహస్తం అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ చేయూత సభ్యులు వారి ఇంటికి వెళ్లి అక్కడి పరిస్థితులు చూసి స్పందించి రూ.10 వేలు నగదు, నిత్యావసర వస్తువులను సోమవారం అందజేశారు.మేకా లక్ష్మీనారాయణ, పరసా నాగార్జున, ఏనుగు రామకృష్ణ, మరీదు లక్ష్మణరావు, గంగుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

దత్తక్షేత్రంలో ప్రత్యేక పూజలు


బాదంపూడి దత్త క్షేత్రంలో స్వామీజీకి పూజలు చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: బాదంపూడి దత్త క్షేత్రంలో మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ పుట్టినరోజు సోమవారం నిర్వహించారు. ఆలయ నిర్మాత శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. విజయగణపతికి, బాలసుబ్రహ్మణ్యస్వామికి, బ్రహ్మవిష్ణుమహేశ్వర్లుకు పూజలు చేశారు. గణపతి స్వామీజీపై సంకీర్తనలు పాడారు.

నిత్యావసరాల పంపిణీ


గిరిజనులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగర, పట్టణ ప్రాంతాల ప్రజలకు మాత్రమే కాక గిరిజన ప్రాంతాల ప్రజలకు సైతం సేవలు విస్తృతం చేయాలనే లక్ష్యంతో ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్, ఏలూరు విజన్ లయన్స్ క్లబ్‌లు పని చేస్తున్నాయని ప్రతినిధులు తెలిపారు. సోమవారం ఈ రెండు క్లబ్‌ల ప్రతినిధులు జిల్లాలోని బుట్టాయగూడెం మండలం మోతుగూడెం, దానిగూడెం, కోర్సవారి గూడెంలలో గిరిజనులకు దోమతెరలు, గొడుగులు, పాదరక్షలు, స్టీలు కంచాలు, గ్లాసులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా క్లబ్‌ల సభ్యులు సీలంశెట్టి కిషోర్, చుక్క అవినాష్, అడపా రాఘవ, తుమ్మల రవికుమార్, తోట ఎడ్వర్డ్, కె.రవి పాల్గొన్నారు.

వైభవం.. మలయప్ప స్వామి కళ్యాణం


మలయప్ప స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: స్థానిక టెంపుల్ సెంటర్లోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ఉపాలయంగా కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈనెల 15న స్వామివారి కల్యాణ మహోత్సవాలు ప్రారంభంగా కాగా ఆదివారం దేవేరులు, స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. కొల్లూరు శ్రీనివాస్ పావని దంపతుల చేత బ్రహ్మశ్రీ శ్రీ సుదర్శనం రామ దుర్గా కుమారాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువు జరిపించారు. స్వామివారి మూలవిరాట్ విగ్రహం ఎదుట ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు నిర్వహించిన అన్న సమారాధనతో ఉత్సవాలు ముగిశాయి.

వైద్య రంగానికి అగ్రపీఠం వేయాలి


నిర్మల కిషోర్‌తో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ అసోసియేషన్ నాయకులు

కొయ్యలగూడెం: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా వైద్య ఆరోగ్య రంగాన్ని అన్ని విధాలుగా అగ్రభాగాన నిలపాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు బొల్లిన నిర్మలా కిషోర్‌ని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి జీవీవీ ప్రసాద్, నాయకులు కోరారు. కొయ్యలగూడెంలోని నిర్మల కిషోర్‌ను సోమవారం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. కొయ్యలగూడెంలో పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు చింతా జానకీరామరాజు, డీవీ రామారావు, కొక్కిరపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

29న వైద్యనిర్ధారణ శిబిరం

దెందులూరు: దెందులూరులో ఈ నెల 29న గారపాటి హైమావతీదేవి ఉన్నత పాఠశాలలో సర్వశిక్ష ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి దివ్యాంగుల నిర్ధారణ వైద్యశిబిరం జరుగుతుందని సర్వశిక్ష డిప్యూటీ కలెక్టర్ బి.సోమశేఖర్ అన్నారు. ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు ఉచిత పరికరాల పంపిణీ కోసం లబ్ధిదారుల గుర్తింపు కార్యక్రమం నిర్వహిస్తామని సోమవారం వివరించారు. దివ్యాంగుల నిర్ధారణ వైద్యశిబిరంపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన కోరారు.

20న దివ్యాంగుల నిర్ధారణ వైద్య పరీక్షలు

కామవరపుకోట: ఈనెల 20వ తేదీన చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించబడనని ఎంఈఓ డి.సుబ్బారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో దివ్యాంగులైన బాల బాలికలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి వారి అవసరాన్ని బట్టి తగిన పరికరం ఇవ్వబడుతుందన్నారు. వైద్య పరీక్షలకు వచ్చే అభ్యర్థులకు, వారి తల్లిదండ్రులకు భోజన వసతితో పాటు రవాణా ఖర్చులు ఇవ్వటం జరుగుతుందన్నారు. వైద్య పరీక్షలకు వచ్చేటప్పుడు మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, సదరం ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్ కాపీలు, తీసుకురావాలన్నారు. బుద్ధి మాంద్యం గల పిల్లలకు అదనంగా కుల ధ్రువీకరణ పత్రం (పాతది ఉన్నా పర్వాలేదు), యూడీఐడీ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలని ఆయన తెలిపారు. మండలంలోని దివ్యాంగులు తప్పనిసరిగా ఈ శిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

చింతలపూడి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు


వేములపల్లిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న విజయరాజు, బీవీఎస్‌రెడ్డి

లింగపాలెం: ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, కార్యకర్తలు ఎవ్వరూ నిరుత్సాహం చెందాల్సిన పని లేదని, ధైర్యంగా ఉండాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు భరోసా కల్పించారు. సోమవారం లింగపాలెం మండలంలోని కలరాయునగూడెం, వేములపల్లి గ్రామాల్లో ఆయన పార్టీ సీనియర్ నాయకుడు బీవీఎస్ రెడ్డితో కలిసి పర్యటించారు. ఇటీవల టీడీపీ శ్రేణుల దాడులకు గురైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి బాధితులను వారు పరామర్శించారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటుందని చెప్పారు. తాము పార్టీ శ్రేణుల వెన్నంటే ఉంటామని ధైర్యంగా ఉండాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. టీడీపీ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నా.. వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం పాటించి శాంతియుతంగా ఉండాలని విజయరాజు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, సొసైటీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, వైస్ ఎంపీపీలు మట్టా సురేష్, కర్లపూడి జాన్సి, పార్టీ నాయకులు రావికొండయ్య, బి ప్రసాద్‌రెడ్డి, ఎం.లోకనాథ్‌రెడ్డి, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు కృష్ణ చైతన్య

బుట్టాయగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో గిరిజనులు సాగు చేస్తున్న పోడుభూములకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య కోరారు. మండలంలోని సీతప్పగూడెంలో సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ మండల సహాయ కార్యదర్శి మడకం దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను టీడీపీ తప్పనిసరిగా అమలు చేసేలా కృషి చేయాలన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజనులు అనేక మంది పోడుభూములను సాగు చేస్తున్నారని వారందరికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే గిరిజన ప్రాంతలో నీటి వసతి లేని గ్రామాల్లో మంచినీటి సదుపాయం కల్పించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయలు కల్పించడంతో పాటు నిర్వాసిత కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జేవీ రమణరాజు, తెల్లం వీరమ్మ, గుండి నాగరత్నం, చోడే గంగరాజు, కుర్స సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు ప్రారంభం


దెందులూరులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ తోట ఏసమ్మ, కార్యదర్శి చౌదరి

దెందులూరు: జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశాల మేరకు మండలంలో పారిశుద్ధ్య పనులు గ్రామాల్లో ప్రారంభించామని దెందులూరు ఎంపీడీఓ శ్రీలత అన్నారు. దెందులూరులో సర్పంచ్ తోట ఏసమ్మ, కార్యదర్శి వీఎస్ చౌదరి చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలింపు, డ్రెయిన్లను పరిశుభ్ర పరచడం తదితర పనులను చేయించారు. ఆరు రోజులు పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు కొనసాగుతాయని ఎంపీడీఓ వివరించారు. అన్ని గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఈఓపీఆర్డీ, కార్యాలయ ఏఓతో కలిసి పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు.

ఏపీకి ప్రత్యేక హోదా కోసం ప్రభుత్వం కృషిచేయాలి


జంగారెడ్డిగూడెంలో సీపీఎం జిల్లా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరానికి ప్రత్యేక ప్యాకేజీ అమలు కోసం కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.జీవరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జంగారెడ్డిగూడెం యూటీఎఫ్ కార్యాలయంలో సీపీఎం జిల్లా శిక్షణ తరగతులు నిర్వహించారు. పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జీవరత్నం మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీలు, పోలవరానికి నిధులు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులకు తక్షణమే జీతాలు పెంచి పర్మినెంట్ చేయాలని, దశలవారీగా వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే వ్యవసాయ కూలీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం నిధులు బడ్జెట్లో తగ్గించిందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వం రెండు లక్షల 50 వేల కోట్లు నిధులు ఈ చట్టానికి పెంచడానికి కృషి చేయాలని, 200 రోజులు పనులు పెంచి రూ.600 వేతనం ఇవ్వటానికి కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో పేదలకు మిగులు భూములు పంచి ఇళ్లు, ఇండ్ల స్థలాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పట్టణ కమిటీ సభ్యులు జోడి సూర్యచంద్రరావు, జి.సూర్యకిరణ్, అందుగుల ప్రభాకర్‌రావు, యాగంటి సీత, ఎస్‌కే సుభాషిణి, వి.గోపి, మరో 100 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి చదువుకు ఆర్థిక సహాయం


విద్యార్థి రవితేజ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

ద్వారకాతిరుమల: మండలంలోని మత్తేవారిగూడెంకు చెందిన విద్యార్థి పంతగాని రవితేజ కుటుంబానికి ఏలూరుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆర్థిక సహాయం అందజేసింది. రవితేజ ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో 920 మార్కులు సాధించడంతో పాటు, జేఈఈ మెయిన్స్ నందు ఎస్సీ కేటగిరిలో ఆల్ ఇండియా 23796వ ర్యాంకు పొందాడు. రవితేజ కుటుంబం ఆర్థికంగా, ఆరోగ్య పరంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వారు జేఈఈ కౌన్సిలింగ్‌కు అవసరమైన రూ.10 వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ నగదును ఉంగుటూరు మండలం గొల్లగూడెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పయ్యావుల సాయిబాబా, ఏలూరు శనివారపుపేటలోని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గారపాటి ప్రకాష్ చేతులమీదుగా రవితేజ కుటుంబ సభ్యులకు అందజేశారు. రవితేజ బీఈ, బీటెక్ చదివేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని తమ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా అందిస్తామని సంస్థ సభ్యులు సీహెచ్ శ్రీధర్, డీకేఎస్ఎస్ ప్రకాష్, పి.ఉమామహేశ్వరరావు, జి.మోహన్, ఇ.శ్రీనివాస్, గుంటూరు శ్రీనివాస్ తెలిపారు.

కొండెక్కిన కొత్తిమీర ధర

● ఘాటెక్కిన ఉల్లి ధర ● సామాన్యుల విలవిల


కొత్తిమీర


ఉల్లి

దెందులూరు: కొత్తిమీర, ఉల్లిపాయల ధరలు కొండెక్కి కూర్చొన్నాయి. పది రోజుల నుంచి ఈ రెండింటికీ ధర పెరగడంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. తెలుగు సంప్రదాయ వంటకాల్లో వాడే కొత్తిమీర ధర నానాటికీ పెరుగుతోంది. మాంసాహారం, శాకాహారం అనే తేడా లేకుండా ప్రతి వంటలోనూ రుచి, వాసన కోసం కొత్తిమీర ఉపయోగిస్తారు. వంటకంతో పాటు రుచి, ఆరోగ్యపరమైన లక్షణాలు కలిగి శారీరక సమస్యలు తొలగించేందుకు విశేషంగా కొత్తిమీర తోడ్పడుతుంది. ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న కొత్తిమీర ధర ఒక్కసారిగా అమాంతంగా పెరిగింది. దీంతో భోజన ప్రియులు పెరిగిన ధరను భరించలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఒకప్పుడు కొత్తిమీర కట్ట రూ.10 ఉండేది. పది రోజుల నుంచి ధర పెరగడంతో ప్రస్తుతం కట్ట రూ. 50 చేరడంతో కొనుగోలుదారులు అవాక్కయ్యారు. అల్పాహారంలోకి కొత్మిమీరతో చట్నీలు చేసుకునే వారు సైతం పెరిగిన ధర చూసి కొనుగోలుకు వెనకడుగు వేస్తున్నారు.

కన్నీరు తెప్పిస్తున్న ఉల్లి ధర

భారతీయ వంటల్లో అతి ముఖ్యమైన పదార్థం ఉల్లి. రక్త పోటు, గుండెజబ్బులు, ఆస్తమా, అలెర్జీ, దగ్గు, జలుబు, నిద్రలేమి, ఊబకాయం వంటి వ్యాధులు నివారణకు ఉల్లి దోహదపడుతుంది. ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉల్లి నుంచి ఆ మేలు పొందే పరిస్థితి లేదు. ఉల్లి మాట ఎత్తాలంటేనే భయమేస్తోంది. పెరిగిన ధరలతో ఉల్లిపాయ కోయకుండానే కంటి నుంచి నీరుకారుతున్న పరిస్థితి నెలకొంది. గతంలో కేజీ రూ.25–30 ఉంటే ప్రస్తుతం రూ. 50 చేరింది. దీనికి తోడు నిల్వలు లేకపోవడం, రవాణా మందగించడంతో ఉల్లి ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. దీంతో కొద్ది ఉల్లిపాయలతోనే కూర తయారు చేసుకునే పరిస్థితి నేడు ఉంది. ఒకవైపు పూర్తిస్థాయి సరఫరా లేక, మరోవైపు పెరిగిన ధరలతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

చుక్కలు చూపిస్తున్న కూరగాయల ధరలు

గణపవరం: కూరగాయల ధరలు సామాన్యుల గూబ గుయ్యిమనిపిస్తున్నాయి. పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. ఏ కూరగాయల ధర విన్నా షాక్ కొడుతున్నాయి. దీనితో సామాన్య, మధ్యతరగతి ప్రజల ఏం కొనాలో.. ఏం తినాలో అర్థంకాక తలపట్టుకుంటున్నారు. సోమవారం గణపవరంలో నిర్వహించిన వారపు సంతలో కూరగాయల ధరలకు రెక్కలొచ్చి ఆకాశంలో విహరించాయి. నెలరోజుల క్రితం ధరలతో పోలిస్తే దాదాపు రెట్టింపు ధరలు పలికాయి. చివరికి ఆకుకూరలు సైతం అందుబాటులో లేకుండా పోయాయి. అల్లం ధర కిలో రూ.100 నుంచి రూ.200కు ఎగబాకింది. కొత్తిమీర కిలో రూ.150 పలికింది. దీనితో హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కర్రీ పాయింట్ల యజమానులు ఇబ్బంది పడ్డారు. ఇక కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. ఉల్లి కిలో రూ.40–50, మిర్చి రూ.80, టమాటా రూ.100, బీర రూ.80, దోస రూ.40, బంగాళ దుంప రూ.40, కాకర రూ.80, చిక్కుడు రూ.120, క్యారెట్ రూ.60, బీట్‌రూట్ రూ.60, చిలగడదుంప రూ.50, మునగకాయలు ఒకటి రూ.10, ఆనపకాయ రూ.40 చొప్పున పలికాయి. ఇక మిగిలిన కూరగాయల ధరలూ గత వారంతో పోలిస్తే 20 నుంచి 30 శాతం పెరిగాయి. మొత్తం మీద రెండు వారాలుగా పెరుగుతూ వస్తున్న కూరగాయల ధరలు ఈ వారం మరింత భారంగా మారాయి.